సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 27 । మార్చి । 2023



పోటెత్తిన భక్తులు 8లో

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



వంద రోజుల పని తప్పనిసరి

జాతీయ ఉపాధి హామీ పథకంలో కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ రమేష్ రామన్ సూచించారు. 8లో



బాధ్యతగా అడవుల సంరక్షణ

అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని రంపచోడవరం రేంజర్ కరుణాకర్ అన్నారు. అడవుల్లో మంటల నివారణపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 8లో



న్యూస్‌రీల్

పోలీసునని నమ్మబలికి..

- బైక్‌తో అగంతకుడు పరారీ
- బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు

రాజవొమ్మంగి: మాయమాటలు చెప్పి మోటారు బైక్‌తో పరారైన నకిలీ పోలీసు ఉదంతమిది. ఎస్‌ఐ జీఎస్ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన దూరి వేణుప్రసాద్ ఈ నెల 23వ తేదీన మోటారు సైకిల్‌పై రాజవొమ్మంగి వచ్చాడు. ఓ పాన్‌షాపు వద్ద కూల్‌డ్రింక్ సేవిస్తున్న అతని వద్దకు ఓ ఆగంతకుడు వచ్చాడు. నేనే పోలీసునని.. ఒకసారి నీ బైక్ ఇవ్వు ఇంటికి వెళ్లి వస్తానని.. పక్కనే ఉన్న లాగరాయి మాగ్రామమని.. నా పేరు సీహెచ్. రాహుల్ చెప్పాడు. పోలీసునని చెప్పడంతో నమ్మిన వేణుప్రసాద్ బైక్‌ను ఇచ్చాడు. లాగరాయి వెళ్లి వస్తానన్న ఆ వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో మోసపోయానని గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ వేదిక

ఎటపాక: మండల పరిధిలో ఈనెల 13 నుంచి 21 వరకు జరిగిన ఉపాధి పనుల ఆడిట్‌పై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ వేదిక ఏర్పాటుచేసినట్టు ఎంపీడీవో విఠల్ పాల్ తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2021 ఏప్రిల్ నుంచి 22 మార్చి వరకు జరిగిన పనులపై ఆడిట్ బృందం తనిఖీ చేసిందని ఆయన తెలిపారు. వాటి వివరాలను మండలస్థాయిలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సామాజిక తనిఖీ వేదికపై వెల్లడించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

- 28తో ముగియనున్న ఎంట్రీల స్వీకరణ గడువు

పాడేరు రూరల్ : పాడేరు మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాల సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఎంట్రీ గడువు ఈనెల 28తో ముగుస్తుందని నిర్వాహకులు కొట్టగుళ్లి సుబ్బారావు, ఎ. రాజారావు, వి. మహేష్, కె. దుర్గారావు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.లక్ష నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదు, షీల్డ్ బహుమతులు అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఇవే కాకుండా టోర్నీలో పాల్గొన్న జట్లకు, ప్రతిభ కనబర్చిన జట్లకు, క్రీడాకారులకు కూడా ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ టోర్నీలో పాల్గొనే జట్లు రూ.3వేలు ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. క్రికెట్ టోర్నీ క్రికెట్ బాల్‌తో నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ప్రతి క్రికెట్ జట్టు నిబంధనలు పాటించాలని యూనిఫాం, షూ ధరించాలని కోరారు. క్రికెట్ మేనేజ్‌మెంట్ వద్ద క్రికెట్ కిట్ నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈనెల 28లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 29న క్రీడాకారుల సమక్షంలో డ్రా తీసి 30న క్రికెట్ పోటీలు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 8500574489, 8309668683, 9390824178 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

మలేరియాకు చెక్!

- నాలుగేళ్లుగా పూర్తిగా తగ్గుముఖం
- ముందస్తు చర్యలతో అదుపులో వ్యాధి
- ఫలించిన ప్రభుత్వ వ్యూహం



8లో

జీ-20 జోష్



కార్నివాల్.. కెవ్వు కేక

విశాఖపట్నం: తెలుగు వైభవం చాటేలా సాగరతీరంలో ఆదివారం నిర్వహించిన కార్నివాల్ అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన సందర్శకులు, పర్యాటకులతో బీచ్‌రోడ్డు జనసంద్రంగా మారింది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాగిన ఈ కార్నివాల్‌తో బీచ్‌రోడ్‌లో పండగ వాతావరణం నెలకొంది. జీ–20 సదస్సు నేపథ్యంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు జీవీఎంసీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్నివాల్‌లో మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పింది. వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు కూచిపూడి, భరత నాట్యంతో అలరించారు. అరకు ధింసా, బుట్ట బొమ్మలు, కోలాటం, భామా కలాపం, వీర నాట్యం వంటి సంప్రదాయ నృత్యాలు అదరహో అనిపించాయి. యువతీ యువకులు దేశ భక్తి గీతాలకు తమదైన శైలిలో డ్యాన్స్‌లు చేసి ఆకట్టుకున్నారు. పులి వేషాలు, కోయ నృత్యాలు, తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, బిందెల డ్యాన్స్, డప్పు వాయిద్యాలు, సాము గారడీలు, తదితర ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను మైమరపింపజేశారు. చిన్నారుల ఫ్యాషన్ షో, రింగులతో స్కేటింగ్ చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జీ–20 దేశాల జాతీయ జెండాలను ప్రదర్శించారు. ముందుగా ఈ కార్నివాల్‌ను రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గిరిజనులతో కలిసి కోయ నృత్యం చేశారు. కార్నివాల్‌లో విదేశీయులు సైతం వివిధ వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్, మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.



కళాకారులతో మంత్రులు అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్





ఆకట్టుకున్న కొమ్ము నృత్యం



ప్రత్యేక ఆకర్షణగా విదేశీ మహిళలు



మారథాన్.. అదిరెన్

విశాఖపట్నం: జీ–20 సదస్సుతో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. జీ–20 సదస్సు నేపథ్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఉత్సాహంగా మారథాన్ జరిగింది. ఆర్.కె.బీచ్‌లోని కాళీ మాత ఆలయం వద్ద రాష్ట్ర మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీ–20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 3కె, 5కె, 10కె విభాగాల్లో పరుగు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మారథాన్‌లో పెద్ద సంఖ్యలో నగరవాసులు, ముఖ్యంగా యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. విశాఖను ప్రపంచ పటంలో ప్రముఖ నగరంగా నిలపాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారని వెల్లడించారు. 200 మందికి పైగా అతిథులు పాల్గొనే జీ–20 సదస్సులో ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకు హాజరవుతున్న వారిని ఆకట్టుకునేలా రూ.157 కోట్లతో నగర సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పోలీసు కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





పారాగ్లైడింగ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు

ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్: జీ–20 సదస్సు జెండాతో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ తీరం చుట్టూ చక్కర్లు కొట్టింది. సుమారు 30 నిమిషాల పాటు తీరంలో తిరుగుతూ సందడి చేసింది. కోస్టల్ బ్యాటరీ నుంచి సాగరనగర్ బీచ్ వరకు నాలుగు రౌండ్లు వేసి ఆకర్షించింది.





మారథాన్‌లో పాల్గొన్న నగరవాసులు

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

జి.మాడుగుల: స్థానిక కేజీబీవీలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని చెర్రెకి జెసిగ్రేసీ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రక్తహీనత, జన్యుపరమైన వ్యాధితో బాధపడుతుండగా గత నెల 15వ తేదీన ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి పాఠశాల యాజమాన్యం తరలించింది. అక్కడి వైద్యుల సూచన మేరకు అదే నెల 17న కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అప్పటి నుంచి అక్కడ సేవలు పొందుతోంది. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో ఈనెల ఏడవ తేదీన డిశ్చార్జి చేసినట్టు పాఠశాల యాజమాన్యం తెలిపింది. అయితే విద్యార్థినిని కుటుంబ సభ్యులు ఆస్పత్రి నుంచి నేరుగా స్వగ్రామం రచ్చపల్లి తీసుకువెళ్లిపోయారు. అప్పటినుంచి ఇంటి వద్ద ఉన్న విద్యార్థిని జెసిగ్రేసీ మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 23న వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందు తూ ఆదివారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థిని రక్తహీనత, జన్యుపరమైన వ్యాధి కారణంగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని ఆమె తండ్రి యోహాన్ పేర్కొన్నారు. విద్యార్థిని జెసిగ్రేసీ అరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించినట్టు కేజీబీవీ ప్రత్యేకాధికారి పార్వతి తెలిపారు. జెసిగ్రేసీ మృతి చెందటం విచారకరమని ఆమె పేర్కొన్నారు.



జెసిగ్రేస్ (ఫైల్)

కుక్కల దాడిలో మేకల మృతి

మాకవరపాలెం: వీధి కుక్కల దాడిలో ఏడు మేకలు మృతి చెందాయి. మండలంలోని శెట్టిపాలెంలో గొర్లి నూకలమ్మకు చెందిన మేకల మందను గ్రామ శివారున గల కల్లంలో ఉంచారు. ఆదివారం ఉదయం ఈ మందపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఏడు మేకలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి.

ప్రశాంతంగా పోస్టల్ ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి, పాడేరు డివిజన్ల పరిధిలో పోస్టల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 11 మంది డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకున్నట్టు రిటర్నింగ్ అధికారి వి.వి.సత్యకుమార్ తెలిపారు. డీసీఎంఎస్‌లో సోమవారం జరిగే ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులను డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకుంటారని చెప్పారు.

ఎన్నికైన డైరెక్టర్లు వీరే..

బి.నూకరాజు, వి.సింహాచలం, ఎం.శ్రీరామ్మూర్తి, ఎస్.హరీష్‌కుమార్, కె.వి.వి.ఎస్.గుప్తా, పి.శ్రీనివాస్, ఎల్.కె.ఎం.పాత్రుడు, సీహెచ్.సత్యారావు, వై.వీరభద్రం, కె.వి.నాగేశ్వరరావు, కె.కిరణ్‌కుమార్.



డైరెక్టర్‌గా ఎన్నికైన వీరభద్రానికి పత్రాన్ని అందజేస్తున్న సత్యకుమార్

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



రాజవొమ్మంగి ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయం

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంలో రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం వీ కృష్ణారావు తెలిపారు. 6వ తరగతిలో బాలికలకు 30, బాలురకు 30 సీట్లు ఉన్నాయన్నారు. ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్సీ సిలబస్ ఇక్కడ అందుబాటులో ఉంది. ఆరవ తరగతితో పాటు 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లు కూడా నింపడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వచ్చేనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాతపరీక్ష పరీక్ష వచ్చే నెల 30వ తేదీన ఉంటుందన్నారు. గురుకులం వెబ్‌సైట్ http//aptwfurukuam. ap.gov.in దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో నడపబడుతున్న అడ్డతీగల ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి కూడా ఇదే తరహాలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫణి కుమార్ కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. మొదట వీరంతా కలసి గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించడం విశేషం. 1992లో ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో చదువుకున్న వీరంతా ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. తాజా వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాటి ఉపాధ్యాయులు టి.వి. శర్మ, వీరభద్రరావులను ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ప్రాంగణంలోనే ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కొంపెల్ల శ్రీనివాసశర్మ, పిడమర్తి శ్రీనివాస్, పట్నాల ప్రసాద్, భోజనపల్లి నాగేశ్వరరావు, కుంజం సత్యనారాయణ, పప్పు మారుతి కిశోర్, సత్యనారాయణ, పాపాని అప్పారావు, వీరవిజయ కుమార్ పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

- నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు

చోడవరం: యువకులు క్రీడలపై మరింత ఆసక్తి చూపాలని నన్నయ్య వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. ఖండిపల్లిలో మార్క్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. నెహ్రూ యువకేంద్రం, కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. ముగింపు కార్యక్రమంలో ముత్యాల నాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ కోచ్ అట్టా అర్జున్ రామకృష్ణను ఆయన అభినందించారు. జిల్లా నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. కబడ్డీ, హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

చింతూరులో నేటి నుంచి గ్రామసభలు

చింతూరు: పోలవరం ముంపులో భాగంగా 41.15(తొలిదశ) కాంటూరులో చేర్చిన చింతూరులో కుటుంబాల సర్వే ఆధారంగా(ఆర్అండ్ఆర్) సోమవారం నుంచి గ్రామసభలు జరగనున్నాయి.

➡ ముంపు జాబితాలో 1,918 కుటుంబాలుండగా అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే వలంటీర్లు ఆయా కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించారు. 1,918 కుటుంబాలను అధికారులు క్లస్టర్ల వారీగా విభజించి మూడ్రోజుల పాటు (27,28,29) గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. వలంటీర్లు ముంపు జాబితాలో వున్న ప్రతీ ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు, బ్యాంకుఖాతా, ఇంటి నెంబర్ల వివరాలను సేకరించారు. మార్పులు ఉంటే వాటిని ప్రత్యేకంగా నమోదు చేసుకున్నారు. దీంతోపాటు గిరిజనులకు ఎటపాక మండలంలో, గిరిజనేతరులకు ఏలూరు జిల్లా తాడ్వాయి వద్ద పునరావాసం కల్పించనున్నట్లు ఆయా కుటుంబాలకు వలంటీర్లు సమాచారం ఇచ్చారు.

➡ గిరిజనేతరులకు ప్రభుత్వం ఇచ్చే స్థలం, ఇల్లు వద్దనుకుంటే దానికి పరిహారం ఇస్తారని, స్థలం, ఇల్లు కావాలా లేక పరిహారం కావాలా అనే అంశాలను వారు నిర్వాసితులను అడిగి నమోదు చేసుకున్నారు. ఇప్పటికే వలంటీర్లు సర్వే పూర్తి చేయడంతో అధికారులు గ్రామసభలపై దృష్టి సారించారు.



చింతూరులో కుటుంబ వివరాలు సేకరిస్తున్న వలంటీర్లు

సభలిలా..

➡ సోమవారం స్థానిక సంతమార్కెట్ ఆవరణలో, 28న బీసీ కాలనీలో, 29న ఎస్టీ కాలనీలో గ్రామసభలు నిర్వహించనున్నారు. వలంటీర్లు సేకరించిన కుటుంబాల వివరాలను ఈ గ్రామసభల్లో అధికారులు వెల్లడించనున్నారు. సదరు వివరాలకు సంబంధించి ఏమైనా మార్పులు, అభ్యంతరాలుంటే నిర్వాసితులు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశముంది.

మల్లెలు కావు.. కాఫీ పూలు

సాక్షి, పాడేరు/గూడెంకొత్తవీధి: ఏజెన్సీలో కురిసిన అకాల వర్షాలు కాఫీ తోటలకు మేలు చేశాయి. ఏజెన్సీ వ్యాప్తంగా విస్తరించి ఉన్న కాఫీ తోటలు సీజన్‌కన్నా ముందుగానే పూశాయి. నెలరోజుల నుంచి ఏజెన్సీలో కాఫీమొక్కలు పూలతో కళకళలాడుతున్నాయి. మల్లెపువ్వుల మాదిరిగా కనువిందు చేస్తున్నాయి. పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలోని 1.56 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలో మరో 20 ఎకరాల్లో కాఫీ తోటలు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం పూతదశలో ఉండటంతో ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని గిరి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు ఘాట్‌రోడ్డులో పూలతో ఆకట్టుకుంటున్న ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటలు

క్లుప్తంగా

తాగునీటి సమస్యపై ఎంపీకి వినతి



ఎంపీ గొడ్డేటి మాధవికి వినతిపత్రం అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు గాసి

అరకులోయ: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా గాసి మర్యాదపూర్వకంగా కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించారు.

రవిబాబుపై తప్పుడు ఆరోపణలు తగదు



విలేకరులతో మాట్లాడుతున్న మైనింగ్ లీజుదారుడు శంకరరావు, నాయకులు

అరకులోయ: ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుపై నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని, నిమ్మలపాడు మైనింగ్ లీజుదారుడు రొబ్బ శంకరరావు, అరకులోయ వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలరాజు, సమర్థి భాస్కరరావు, చిన్నా రావు అన్నారు. మండల కేంద్రంలోని విలేకరుల తో ఆదివారం మాట్లాడుతూ టీడీపీ నాయకుడు దొన్నుదొర, బీజేపీ నాయకుడు రాజారావు తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఏపీఎండీసీ సంస్థ టెండర్ల విషయంపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

చిన్నారి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్

నర్సీపట్నం: పియర్ రాబిన్సన్ సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్న నాతవరానికి చెందిన చిన్నారి అమర్త్యరామ్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.7.50 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును బాబు తల్లిదండ్రులకు తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం అందజేశారు.

మలేరియాకు చెక్!

- నాలుగేళ్లుగా పూర్తిగా తగ్గుముఖం
- ముందస్తు చర్యలతో అదుపులో వ్యాధి
- ఫలించిన ముందస్తు వ్యూహం



వైద్య సేవలు అందిస్తున్న బృందాలు



గిరిజనుల నివాసాల్లో దోమల నివారణ మందును పిచికారి చేస్తున్న వైద్య, సచివాలయాల ఉద్యోగులు

సాక్షి, పాడేరు: పూర్వం నుంచి గిరిజన ప్రాంతం మలేరియా పీడిత మన్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రికార్డులో ఉంది.ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు వ్యాధుల సీజన్‌గా గుర్తించిన వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ సమయంలో మలేరియా ప్రభావం ఎక్కువగా ఉండేది. 2012 నుంచి 2018 వరకు మన్యంలో విజృంభించిన మలేరియా ఆ తరువాత క్రమేపీ తగ్గుముఖం పట్టింది. పాడేరు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 62 పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేసింది.

➡ దోమల నియంత్రణ, దోమతెరల వినియోగంపై గిరిజనులను చైతన్య పరిచింది.ఎపిడిమిక్ సీజన్ ప్రారంభంలోనే మలేరియా పీడిత గ్రామాలతో పాటు, సాధారణ గ్రామాల్లోను దోమల నివారణ మందు పిచికారి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది.హైరిస్క్ గ్రామాల్లో మూడవ సారి దోమల మందు పిచికారి పనులు జరిగేవి.

➡ గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు మలేరియా ప్రభావం తగ్గేందుకు దోహదపడింది. ప్రతీ 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ల సేవలను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేవడంతో సీజనల్ వ్యాధుల నివారణ లక్ష్యంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖ బృందాలు.సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఎంతో శ్రమిస్తున్నారు.

➡ జిల్లా వ్యాప్తంగా 8లక్షల వరకు దోమ తెరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. మరణాలు కూడా లేకుండానే మలేరియాను కట్టడి చేయడంలో ప్రభుత్వ ముందస్తు వ్యూహం ఫలించింది. జ్వరపీడితులకు మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి సకాలంలో వైద్య సేవలు కల్పించడంతో గిరిజనులు సకాలంలో కోలుకున్నారు. ఎపిడిమిక్ సీజన్‌లో అన్ని గ్రామాలలోను వైద్యబృందాలు ఇంటింటా తిరగడంతో పాటు, ప్రత్యేక వైద్యశిబిరాలు కూడా విజయవంతంగానే జరుగుతున్నాయి. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఎపిడిమిక్ సీజన్‌కు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు వైద్యారోగ్యశాఖ, మలేరియా శాఖలు కసరత్తు చేస్తున్నాయి.

సంవత్సరం	రక్తపూతల సేకరణ	మలేరియా పి.వి/పి.ఎఫ్	మరణాలు
2018	7,52,584	2252	0
2019	7,90,940	1121	0
2020	6,12,917	1260	0
2021	7,31,759	841	0
2022	7,09,124	830	0
2023(మార్చి)	1,24,781	150	0



జ్వరపీడితులకు రక్తపరీక్షలు జరుపుతున్న వైద్యసిబ్బంది

కేసులు తగ్గుముఖం



జిల్లాలోని 62 ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో మలేరియా జ్వరాల తీవ్రత నాలుగేళ్లలో తగ్గింది. దోమల నివారణ పనులతో పాటు దోమతెరల వినియోగంపై ప్రజలను నిరంతరం చైతన్యపరుస్తున్నాం. మలేరియా నివారణకు వైద్యబృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. మలేరియా జ్వరాలు సోకినట్టు నిర్ధారణ అయిన వెంటనే వైద్యసేవలు సకాలంలో అందించడం వల్ల మరణాలు తగ్గించాం. ఈ ఏడాది కూడా మలేరియా నిర్మూలన లక్ష్యంగా యాక్షన్‌ప్లాన్‌ను ఆమలుజేస్తున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

వంద రోజుల పని తప్పనిసరి

డ్వామా పీడీ రమేష్‌రామన్

వీఆర్‌పురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేసే కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని డ్వామా పీడీ ఎస్.రమేష్ రామన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉపాధి హామీ కూలి రేట్లు పెరగనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న రూ.257 కూలీకి అదనంగా రూ.15 పెంచి రూ.272 కూలి చెల్లించనున్నట్లు తెలిపారు. మండలంలోని11 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శాఖలవారీగా చర్చించారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఎన్ఆర్‌జీఎస్, పీఆర్, ఏహెచ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధుల్లో రూ.9.56 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.ఫణేంద్ర, చింతూరు ఎంపీడీవో రవిశంకర్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఏపీవో ఎస్.రాఘవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

దేవీపట్నం: మండలంలోని గొందూరు గ్రామంలో అఖండ గోదావరి నది ఒడ్డున ఉన్న మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జాతర మహోత్సవాలు నాల్గవ రోజు కావడంతో వివిధ జిల్లాల నుంచి పురుషోత్తపట్నం, దండంగి మీదుగా పలు వాహనాల్లో భారీగా విచ్చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ. 44,465 ఆదాయం సమకూరినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

బాధ్యతగా అడవుల సంరక్షణ



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న రేంజ్ ఆఫీసర్ కరుణాకర్

అటవీశాఖ రేంజర్ కరుణాకర్

రంపచోడవరం: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని రేంజర్ కరుణాకర్ అన్నారు. అడవుల్లో మంటల నివారణపై పోక్సుపేట రేంజ్ పరిధిలోని రంపచోడవరం, గంగవరం మండలాల్లోని నరసాపురం, దొరమామిడి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. అడవులు తగులబడటం వల్ల వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ఎఫ్‌బీవోఎల్‌బీ మాణిక్యం, బుల్లెమ్మ, జగదీష్, సుభద్రదేవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మండలంలో దొరమామిడి గ్రామంలో ఆదివారం 'అడవిలో నిప్పు అడవుల మనుగడకు ముప్పు' పేరిట పోక్సుపేట రేంజర్ కరుణాకర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చంద్రకళ, ఆముదాలబంద ఎంపీటీసీ సభ్యుడు పండా ఆదినారాయణ, డీఆర్వో టి. రాజు, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు మనోహర్, సుభద్రదేవి, జగదీష్, మాణిక్యం, బుల్లమ్మ, అఖిల్, వనసంరక్షణ సమితి చైర్మన్లు సత్యవతి, వెంకట్రావు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఫలితాలు సాధించాలి



పెదబయలులో గురుకులం టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



పాఠశాల సిబ్బందితో రామ్మోహన్ రెడ్డి

గిరిజన గురుకులం రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

పెదబయలు: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏపీ గురుకులం సహాయ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పెదబయలు ఏపీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల లో పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆంగ్ల మాధ్యమం టెస్ట్ బుక్స్ చదివించారు. విద్యార్థులు సమాధానాలు బాగా చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలంటే ముందు భయం లేకుండా ఉండాలని, తర్వాత ఎలా రాస్తే మంచి మార్కులు వస్తాయి, మంచి దస్తూరి, కొట్టి వేతలు లేకుండా రాయడం, ముందుగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలని, తదితర విషయాలను వివరించారు. బైజూస్ యాప్ ఎలా ఉపయోగపడుతుందని, ఉపాధ్యాయులు ఎలా అవగాహన కల్పిస్తున్నారని 8వ తరగతి విద్యార్థులను ప్రశ్నించారు. ఉపాధ్యాయులు తరగతిలో చెప్పిన తర్వాత అదే పాఠాన్ని అనేకమార్లు చదవడం వల్ల సందేహం తీరుతుందని సమాధానమిచ్చారు. గతంలో సందేహం వస్తే మరలా టీచర్‌ను అడిగేవారమని, రోజూ సందేహాలు అడగడం ఇబ్బందిగా ఉండేదని, ఇప్పుడు ట్యాబ్ ఓపెన్ చేసి చూసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం మన బడి నాడు –నేడు ద్వారా సదుపాయాల కల్పన, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య, విద్యా కానుక కిట్లు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, చదువుతోపాటు మంచి ఆరోగ్యం అందించేందుకు పౌష్టికాహారంతో కూడిన మెనూ అందిస్తున్నట్లు డిప్యూటీ కార్యదర్శి తెలిపారు. అనంతరం పాఠశాలలో సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వేతనాలు పెంచాలని, తక్కువ వేతనాలతో పని చేస్తున్నామని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆయనకు అందించారు. అల్లూరి జిల్లా నోడల్ ప్రిన్సిపల్ మూర్తి, స్థానిక ప్రిన్సిపాల్ శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగిత టోల్‌ప్లాజాకు రెండు అంబులెన్స్‌లు

- అనకాపల్లినుంచి అన్నవరం వరకు సేవలు
- 1033కి ఫోన్ చేస్తే క్షణాల్లో ఘటనాస్థలానికి





కాగిత టోల్‌ప్లాజాకు కేటాయించిన అంబులెన్స్‌లు, (ఇన్‌సెట్) అంబులెన్స్ లోపలి భాగం

నక్కపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదు. ప్రమాదాలు జరిగిన సమయంలో కొన్ని సందర్భాల్లో సకాలంలో వైద్యం అందక పలువురు మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయరహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలకు అంబులెన్స్‌లను కేటాయించింది. జిల్లాలో నక్కపల్లి మండలం కాగిత వద్ద ఉన్న టోల్‌ప్లాజాకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఆధునాతన సౌకర్యాల(అడ్వాన్స్ లైఫ్ సపోర్టు)తో కూడిన రెండు అంబులెన్స్‌లను సమకూర్చింది. అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వరకు 90 కిలోమీటర్ల మేర టోల్‌ప్లాజా సేవలందుతున్నాయి. కాగిత టోల్‌ప్లాజాకు సమకూర్చిన రెండు వాహనాల్లో ఒకదాన్ని యలమంచిలి సమీపంలో ఉన్న కొక్కిరాపల్లిలోను, మరొక వాహనాన్ని అన్నవరం సమీపంలో తేటగుంట టోల్‌ప్లాజా యార్డు వద్ద అందుబాటులో ఉంచుతారు. శిక్షణ పొందిన సిబ్బంది ఈ వాహనాల్లో విధులు నిర్వహిస్తారు. ఆధునిక పరికరాలు ఉండటం వల్ల 90 శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని నేషనల్ హైవే అధికారి నూనె శ్రీనివాసరావు తెలిపారు. ఆపదలో ఉన్నవారు, ప్రమాదాల బారిన పడిన వారు 1033 నంబరుకు గాని, సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు గాని ఫోన్ చేయాలని చెప్పారు.

హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

నర్సీపట్నం: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు హెచ్‌ఎంలు, నలుగురు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదివారం షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జేసీ కల్పనా కుమారి కృషి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం అమలు తీరు పర్యవేక్షణలో భాగంగా డిప్యూటీ డీఈవో నర్సీపట్నం మండలంలోని పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్), జిల్లా పరిషత్ హైస్కూల్(తురకబడి), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఒక్క బొడ్డేపల్లి స్కూల్ మినహా మిగిలిన పాఠశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీ హైస్కూల్(తురకబడి) సోషల్ టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పీఎస్, సోషల్ టీచర్లు, చెట్టుపల్లి హెచ్‌ఎం, జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్) హెచ్‌ఎం, సోషల్ టీచర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

అమ్మకు నీరాజనం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ రహదారిపైకి బారులు తీరిన భక్తులు

- నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- కిక్కిరిసిన క్యూకాంప్లెక్స్‌లు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయా నికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తుల తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేసిన చలువపందిళ్లలో వంటలు చేసుకున్నారు. వంటకాలతోపాటు పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, అరటిపళ్లు, చీర, జాకెట్ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుటుంబసమేతంగా సహపంక్తిభోజనాలు చేశారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. భక్తులకు ఆలయ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ దాడి మోహనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రభుత్వవిప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ



తుమ్మపాల: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జైలుకెళ్లడం ఖాయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సీమన్స్ సంస్థ పేరుతో షెల్ కంపెనీలు సృష్టించారని ఆయన ఆరోపించారు. అనకాపల్లి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారంతో తమ కంపెనీకి ఎటువంటి సంబంధం లేదని ఇప్పటికే సీమన్స్ ప్రతినిధులు స్పష్టం చేశారని తెలిపారు. నిరుద్యోగుల పేరిట బాబు దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. ఆధారాలతో సహా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అసెంబ్లీలో వివరించారని తెలిపారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే నలుగురిని ఈడీ అరెస్టు చేసిందని, చంద్రబాబుపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దేశచరిత్రలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు అతిపెద్ద దొంగ అని అన్నారు. చంద్రబాబు విజన్ 2020 కాదని 420 అని రాష్ట్రప్రజలు గుర్తించాలన్నారు. ఈ స్కామ్ 2017లో బయటపడినప్పటికీ అధికారంలో ఉన్న చంద్రబాబు చక్కగా మేనేజ్ చేసి బయటకురాకుండా చేశారన్నారు. అన్ని ఆధారాలు పక్కాగా ఉన్నాయని, ఈ కుంభకోణం నుంచి బాబు బయటపడేది లేదని తెలిపారు. సీఐడీ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు పూర్తి విచారణ చేస్తున్నాయన్నారు. చంద్రబాబుపై చర్యలు తీసుకునే రోజులు త్వరలోనే వస్తున్నాయని చెప్పారు.